

# విజయవాడ వాసులకు తీపికబురు..

విజయవాడ నుంచి దుబాయ్‌కు విమాన సర్వీసు నడిపేందుకు అరబ్ ఎమిరేట్స్ అధ్యయనం జరుపుతోంది. ఇందులో భాగంగా ఆ సంస్థ ప్రతినిధులు ఇటీవల విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని సందర్శించి వెళ్లారు. ఎయిర్‌పోర్టులోని టెర్మినల్లను పరిశీలించి, ట్రాఫిక్ ఎలా ఉంటుందనే వివరాలను తెలుసుకుని వెళ్లారు. పూర్తి అధ్యయనం తర్వాత విజయవాడ దుబాయ్ విమాన సర్వీసుపై నిర్ణయం తీసుకోనున్నారు.

విజయవాడ వాసులకు తీపికబురు. విజయవాడ నుంచి దుబాయ్‌కు త్వరలోనే విమాన సర్వీసు అందుబాటులో రానుంది. దుబాయ్ వెళ్లాలంటే హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం లేకుండా.. విజయవాడ నుంచి దుబాయ్ విమాన సర్వీసు ప్రారంభించే దిశగా అడుగులు పడుతున్నాయి. విజయవాడ - దుబాయ్ విమాన సర్వీసు విషయంపై అరబ్ ఎమిరేట్స్ సంస్థ పరిశీలన జరుపుతోంది. తాజాగా అరబ్ ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ అధికారులు కూడా విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని సందర్శించారు. విజయవాడ విమానాశ్రయం డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డితో సంప్రదింపులు జరిపారు. దీనికి తోడు విజయవాడ నుంచి దుబాయ్‌కు ఎంత మంది ప్రయాణికులు వెళుంటారు.. ట్రాఫిక్ ఎలా ఉంటుందనే దానిపైనా అరబ్ ఎమిరేట్స్ అధికారుల బృందం సర్వే జరుపుతున్నట్లు సమాచారం.

మరోవైపు విజయవాడ ఎయిర్‌పోర్టులో ఉన్న ఇంటీరియం టెర్మినల్ బిల్డింగ్‌ను ఎమిరేట్స్ అధికారులు పరిశీలించారు. అలాగే పాత టెర్మినల్‌ను కూడా సందర్శించారు. నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణ పనులను కూడా పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. విజయవాడ ఎయిర్‌పోర్టులో కొత్తగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ మరో ఆరు నెలల్లో పూర్తికానుంది. దీని గురించి కూడా ఎమిరేట్స్ ప్రతినిధులు వివరాలు తెలుసుకున్నట్లు తెలిసింది. అయితే విజయవాడ - దుబాయ్ విమాన సర్వీసుల ప్రారంభంపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఎమిరేట్స్ సంస్థ సొంతంగా జరుపుతున్న సర్వే పూర్తయిన తర్వాత ఈ విషయంలో క్లారిటీ రానుంది. మరోవైపు విజయవాడ నుంచి దుబాయ్ విమాన సర్వీసు నడపాలని గత టీడీపీ హయాంలోనే నిర్ణయించారు. ఈ విషయమై ప్రభాభిప్రాయ సేకరణ కూడా జరిపారు. ఇందులో ఎక్కువ మంది ప్రజలు విజయవాడ దుబాయ్ విమాన సర్వీసు ప్రారంభించాలని కోరారు. దీంతో వయబులిటీ గ్యాప్ ఫండింగ్ ద్వారా విజయవాడ దుబాయ్ విమాన సర్వీసు నడపాలని నిర్ణయించారు. అయితే ఆ తర్వాతి కాలంలో ఈ దిశగా అడుగులు పడలేదు. తాజాగా అరబ్ ఎమిరేట్స్ బృందం విజయవాడ ఎయిర్‌పోర్టును పరిశీలించి వెళ్లటంతో.. ఈ ప్రాంత వాసుల్లో మళ్లీ దీనిపై ఆశలు చిగురిస్తున్నాయి. అయితే పూర్తి స్థాయి సర్వే తర్వాతే అరబ్ ఎమిరేట్స్ ఈ సర్వీసుపై నిర్ణయం తీసుకోనుంది.

### అమ్మాయిని వీడియో తీసిన యువకుడు..

# యువతిపై కేసు!

విశాఖపట్నం జిల్లా గాజువాకలో దారుణ ఘటన జరిగింది. తమ అమ్మాయిని వీడియో తీశాడనే కారణంతో ఓ యువకుడిని ఆమె కుటుంబసభ్యులు ఇంట్లో బంధించారు. మీ అమ్మానాన్నకు చెప్తామంటూ బెదిరించారు. మీ వాడి నిర్వాకం ఇదంటూ అతని తల్లిదండ్రులకు సమాచారం చేరవేశారు. యువకుడి తల్లిదండ్రులు ఘటనాస్థలికి చేరుకుని చూసేసరికి సదరు యువకుడు.. ఉరేసుకుని కనిపించాడు. దీంతో యువకుడి తల్లిదండ్రులు గుండెలు పగిలేలా రోదిస్తున్నారు. గాజువాకలోని శ్రీరాంనగర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది.

విశాఖపట్నం జిల్లా గాజువాకలో దారుణం చోటుచేసుకుంది. ఓ అమ్మాయిని ఓ యువకుడు వీడియో తీశాడు. ఇది గమనించిన యువతి.. ఈ విషయాన్ని తన కుటుంబసభ్యులకు చేరవేసింది. దీంతో యువకుడిని ప్రశ్నించిన యువతి కుటుంబసభ్యులు.. ఆవేశంలో అతనిపై చేయి చేసుకున్నారు. అనంతరం మీ తల్లిదండ్రులకు చెప్తామంటూ ఓ గదిలో బంధించారు. కానీ.. ఆ తర్వాత ఏం జరుగుతుందనేదీ వారు ఊహించలేకపోయారు. పక్కింటి అమ్మాయి వీడియో తీయటం ఆ యువకుడి పాలిట శాపమైతే.. అతన్ని బంధించడం ఆమె కుటుంబసభ్యులు జైలుకు వెళ్లటానికి కారణమవుతోంది.

గాజువాక పోలీసులు చెప్తున్న వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా ఫూల్‌బాగ్‌కు చెందిన భాస్కర్‌రావు అన యువకుడు ఫార్మాసిటీలో ఉద్యోగం చేస్తున్నారు. ఫార్మాసిటీలోని ఓ కంపెనీలో భాస్కరరావు ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. అయితే గాజువాక శ్రీనగర్ సమీపంలోని శ్రీరాంనగర్‌లో భాస్కరరావు అద్దె ఇంట్లో ఉంటున్నాడు. అయితే శనివారం ఉదయం భాస్కరరావు పక్కింటి యువతిని వీడియో తీసినట్లు తెలిసింది. ఈ విషయాన్ని గుర్తించిన యువతి కుటుంబ సభ్యులు భాస్కరరావు వద్దకు వచ్చి అతన్ని గట్టిగా నిలదీశారు. భాస్కరరావు సెల్ ఫోన్?లోనివీడియోను డిలీట్ చేయించటమే కాకుండా.. అతనిపై చేయి చేసుకున్నారు.

నువ్వు చేసిన పనిని మీ అమ్మానాన్నకు చెప్తామంటూ బెదిరించారు. వాళ్లు వచ్చిన తర్వాత నీ సంగతి తేలుస్తామంటూ భాస్కర్‌రావును యువతి కుటుంబసభ్యులు ఓ ఇంట్లో బంధించారు. ఆ గది బయట తాళం వేసి.. భాస్కరరావు చేసి పనిని విజయనగరంలోని తల్లిదండ్రులకు తెలియజేశారు. అయితే భాస్కరరావు తల్లిదండ్రులు వచ్చి.. గది తలుపులు తెరిచి చూసేసరికి.. అతని విగతజీవుడై కనిపించాడు. గదిలోని సీలింగ్ ఫ్యాన్ రాడ్డుకు ఉరేసుకుని కనిపించాడు. దీంతో భాస్కరరావు తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అయితే భాస్కరరావు ముఖంపై గాయాలున్నాయంటూ.. ఈ విషయాన్ని పోలీసులకు చేరవేశారు. భాస్కరరావు తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఘటనాస్థలికి చేరుకుని అక్కడి పరిస్థితిని పరిశీలించారు. యువతి సహా ఆమె కుటుంబ సభ్యులు నలుగురిపై కేసు నమోదు చేశారు. వీరిని అదుపులోకి తీసుకుని.. ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. అయితే భాస్కరరావు ముఖంపై గాయాలున్నాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తమ కొడుకును కొట్టి చంపేశారంటూ ఆరోపిస్తున్నారు.

# 'పిల్లల పెంపకం'పై స్ఫూర్తి కుటుంబం కార్యక్రమం









**ఆంధ్రప్రదేశ్ స్ఫూర్తి కుటుంబం శ్రీ శక్తి సోషల్ స్ఫూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. విజయవాడలో 'పిల్లల పెంపకం తల్లిదండ్రుల బాధ్యత' అనే అంశంపై చర్చా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన వక్తలు ఈ చర్చా కార్యక్రమంలో తమ అభిప్రాయాలను తెలియజేశారు. స్ఫూర్తి కుటుంబం నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతం కాగా.. ఇలాంటి మంచి కార్యక్రమాలు తరచూ నిర్వహిం చాలని పలువురు కోరారు.**

ఆధ్యాత్మిక విశ్వ గురువు ది సైంటిఫిక్ సెయింట్ పూర్ణ గురుదేవులు శ్రీ శ్రీ శ్రీ గురు విశ్వస్ఫూర్తి వారి ఆశీస్సులతో.. స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ఆంధ్రప్రదేశ్‌లో భాగమైన శ్రీ శక్తి సోషల్ స్ఫూర్తి ఆధ్వర్యంలో.. 'పిల్లల పెంపకం తల్లిదండ్రుల బాధ్యత' అనే అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. విజయవాడలోని శ్రీరస్తు ఫంక్షన్ హాల్లో ఆదివారం (ఫిబ్రవరి 2న) నిర్వహించిన ఈ కార్యక్రమానికి మహిళలు హాజరై.. ఈ అంశంపై చక్కని అవగాహన పొందారు. ముందుగా భక్తులు మూలమంత్రోఛ్చారణతో తమ గురుదేవులను ఆహ్వానించుకొని.. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గురుదేవుల విశిష్టతను తెలియజేస్తూ కుమారి సింధూరి నాట్యం చేసి, అందరిని అలరించారు. అనంతరం నిర్వహించి చర్చా వేదికలో.. చేయూత ఫౌండేషన్ డైరెక్టర్, మానసిక శాస్త్రవేత్త డాక్టర్ టి. కృష్ణకుమారి, సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ తెలుగు హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ డాక్టర్ రాజరాజేశ్వరి, విశ్రాంత ప్రధానోపాధ్యాయిని డాక్టర్ వి. సత్యవతి, నూజివీడు జిల్లా పరిషత్ బాయ్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని డాక్టర్ బి హేమలతలు వక్తలుగా పాల్గొన్నారు. స్ఫూర్తి కుటుంబం ట్రస్టీ యు సౌజన్యశ్రీ అధ్యక్షతన చర్చ నిర్వహించారు.

స్త్రీ ఆ'సక్తి ' ఒక్కటే.. ఏకత ద ఎటర్నల్.. సోర్స్ ఆఫ్ ఎనర్జీ అన్నారు స్ఫూర్తి కుటుంబం ట్రస్టీ సౌజన్యశ్రీ. శక్తి అనేక రకాలుగా ఉంటుందని భిన్నతను వివరించారు. పిల్లల్ని కని పెంచి భర్తకు సేవ చేస్తూ అతని అదుపాజ్ఞల్లో ఉండేది 'ఆడది' అన్నారు. పురుషుడితో సమానంగా హక్కులు కోసం పోరాడుతూ ఉండేది మహిళ.. మహిళా సంఘాలు , మహిళా ఉద్యమాలు అంటూ పోరాటాలు చేస్తుంటారన్నారు. మనవాళ్లు అంటూ తన కుటుంబాన్ని చూసుకుంటూ సమాజం పట్ల అవగాహన కలిగి.. సమాజాన్ని మార్చగలిగేది స్త్రీ అన్నారు. వివరించారు. 'ఆ 'సక్తి' ఈ శక్తికి ఎలా తోడ్పడాలి? శ్రీ గురుదేవులు చెప్పిన ఆసనా ప్రాణాయామ ధ్యానం చేస్తూ గ్రంథ పఠనం తో , జ్ఞానార్జన చేస్తూ శక్తి స్వరూపిణిగా మారితే , సమాజ స్ఫూర్తి అవుతుంది' అని వివరించారు. నేటి సమాజంలో ఆధునిక టెక్నాలజీ వినియోగంతో పిల్లల ప్రవర్తనలో కలిగే చెడు మార్పులు, వారి పెంపకం బాధ్యత, వారి ఆహార అలవాట్లు, స్నేహాలు, విద్యావిషయాలు, వారి భవిష్యత్తుపై తల్లిదండ్రుల ఆశలు, వాటివల్ల తలెత్తే సమస్యలు వంటి అంశాలపై జరిగిన చర్చ కార్యక్రమంలో వక్తలు గురుదేవుల గ్రంథాల్లోని అంశాలను ఉదహరిస్తూ, సభికులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు వివరించారు.

ఆంధ్రప్రదేశ్ స్ఫూర్తి కుటుంబం

ఆధునిక టెక్నాలజీను వాడటంలో తప్పులేదు కానీ నియంత్రణను అలవాటు చేయాలి అన్నారు విశ్రాంత ప్రధానోపాధ్యాయిని డాక్టర్ సత్యవతి. పిల్లలు అడ్డదారులు తొక్కకుండా, అధికారం,పెత్తనం చేయకుండా, తల్లి వారితో స్నేహంగా ఉంటూ గమనించాలని సూచించారు. వాస్తవ పరిస్థితులను గ్రహించాలని.. వారిపై తమ అభిప్రాయాలను, ఆశలను రుద్దకూడదు అన్నారు.

### ఏపీ స్ఫూర్తి కుటుంబం

పిల్లల పెంపకం , కుటుంబ బాధ్యత ప్రధానంగా స్త్రీదే అన్నారు నూజివీడు జిల్లా పరిషత్ బాయ్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని డాక్టర్ బి హేమలత. మహిళ సాధికారత కోరటం కాదు.. సంసారిక నీతి సామాజిక రీతిని పాటించాలన్నారు. హక్కుల కోసం పోరాడితే ప్రకృతిని ధిక్కరించినట్లేనని.. 'ఈ బిడ్డలు నా కడుపున పుట్టిన వారు, ఇతడు నా వాడు, నా భర్త అనే భావం ఉన్నప్పుడు హక్కులు గురించి ఆలోచించవలసిన పని లేదు' అన్నారు. ఉద్యోగ ధర్మం నిర్వహించే శక్తి , ఇంటి పనులు నిర్వహించే శక్తి , అన్ని స్త్రీ ఉన్నాయని.. పిల్లల్లో నిత్యం వచ్చే మార్పులను తల్లి గమనించాలని.. తండ్రి ఇంటి యజమాని అయినా , తల్లిదే ప్రధాన బాధ్యత అన్నారు. 'తెలివైన భార్య కుటుంబానికి తెరచాప లాంటిది అంటారని.. 'అమ్మ' అన్నది కమ్మని మాట అని శ్రీ గురుదేవులు చెప్పిన మాటల్ని గుర్తు చేశారు.

### వక్తలకు సత్కారం

సృష్టిలోనే వ్యత్యాసం ఉంటుందని.. అన్ని సమానంగా ఉండడం అసాధ్యమన్నారు చేయూత ఫౌండేషన్ డైరెక్టర్, మానసిక శాస్త్రవేత్త డాక్టర్ టి. కృష్ణకుమారి. అందరికీ అన్నిటిలో సామర్థ్యాలు, ఆసక్తి ఉండదని.. తల్లిదండ్రులు ఒక షాడో లాగా,







ఒక కోచ్‌లా, ఒక గైడ్‌లా, స్నేహితుల్లాగా ఉండాల న్నారు. వారి మెంటల్ ఎబిలిటీ , ఆటిట్యూడ్ని బట్టి పిల్లల్లో అభిరుచులు, ఆశయాలు ప్రారంభంలోనే మొదలవుతాయన్నారు. చదివే వాడికి శ్రద్ధ, అభిలాష ఉండాలని.. శ్రమ చేయించాలన్నారు. విజ్ఞాన వికాసం కలిగించాలని.. బ్రతుకుదెరువు బాట సిద్ధంగా ఉంచాలన్నారు. మేధావులుగా ఆత్మ ప్రకాశిస్తే ఆత్మీయలవుతారని.. మానవజాతి ఉన్నతులుగా రావాలన్నారు. పిల్లలతో ఆడాలి, పాడాలని.. శివాజీ గొప్ప వాడు కావడానికి తల్లి జిజియా బాయి కారణమన్నారు.

### వక్తలకు సన్మానం

'మదర్స్ ఆర్ ద ఆర్కిటెక్చర్స్ ఆఫ్ ద సొసైటీ' అన్నారు. చిన్నప్పుడే మంచి అలవాట్లు చేయాలన్నారు. తల్లిదండ్రులు పిల్లల మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ తగ్గించుకోవాలని.. వినే శక్తి వాళ్లకి ఉండాలంటే వినిపించే ఆసక్తి తల్లిదండ్రులకు ఉండాలన్నారు. జంక్ ఫుడ్ మీద, స్ట్రీట్ ఫుడ్ మీద, రైడింగ్ జరిగిన క్లిప్స్ తల్లిదండ్రులు పిల్లలకు చూపి వారిని వారించాలన్నారు. పసుపు, తులసి వంటి వాటిని వాడడం అలవాటు చేసి సహజతను తెలియజేయాలన్నారు. ఎందుకు అనే ప్రశ్నకు జవాబు వయసుకు తగినట్లుగా చెప్పాలని శ్రీ గురుదేవులు సూచించినట్లు చెప్పారు.

### వక్తలకు స్ఫూర్తి కుటుంబం సత్కారం

భర్తకు భార్య భోగ వస్తువు మాత్రమే కాదు.. జీవిత భాగస్వామి .. పిల్లల బాధ్యత తల్లిదేనన్నారు సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ తెలుగు హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ డాక్టర్ రాజరాజేశ్వరి. భర్త పట్టించుకోక పోయినా భార్యకు బాధ్యత ఉందని.. ధర్మ , అర్థ, కామ, మోక్షలలో, వివాహ బంధంతో దాంపత్య ధర్మం ఏర్పడుతుందన్నారు. కుటుంబ వ్యవస్థకు పునాది ఈ ధర్మమని.. కుటుంబాల్లో ఏర్పడే సమస్యలకు గురుదేవులు 37 గ్రంథాల ద్వారా పరిష్కారాలు అందించారన్నారు. గురుదేవులు చెప్పిన అంశాలు తక్కువగా ఉన్నా.. అర్థం మాత్రం చాలా లోతుగా ఉంటుందన్నారు. పిల్లలకు క్రమ శిక్షణ అంటే గురుశిక్షణ అని నీతి నియమాలు నేర్పాలన్నారు. కుటుంబంలో స్త్రీకి పూర్తిగా బాధ్యత ఉందిని.. వ్యక్తిగత ఆస్తిపై ఆమెకు హక్కు తన బిడ్డల కోసం మాత్రమే ఖర్చు పెట్టాలన్నారు. ప్రయత్నం పురుష లక్షణమే కాదు స్త్రీకి సహజలక్షణం కూడా అన్నారు. క్రమశిక్షణ అంటే గురు శిక్షణ, పెద్దరికం పెత్తనం ఒకటి కాదని.. మానవత్వం కలిగిన మహోన్నత స్థితికి చేర్చాల్సిన ఆ బాధ్యత, ప్రేమతో నిర్వర్తించవలసిన బాధ్యత ఉందన్నారు. దీనికి మానసికశక్తి అవసరమని.. అందుకు గురుదేవులు చూపిన ఆసన ప్రాణాయామ, ధ్యాన సాధన మార్గం అన్నారు.

### స్ఫూర్తి కుటుంబం

అనంతరం అంతుమా దేవి , ప్రభావతి గురుదేవుల కాన్సెప్ట్ను తెలియజేసే ఒక స్కిట్ ప్రదర్శించారు. అనంతరం అంజలి గురుదేవులతో తమ దివ్య అనుభవాన్ని పంచుకున్నారు . ఆ తర్వత వక్తలను శాలువాలతో , మొమెంటోలతో సత్కరించారు.. ప్రమీల వందన సమర్పణ చేయగా, భక్తులు గురుదేవుల ఆశీస్సులు పొంది మహాప్రసాదం స్వీకరించారు . ఇటువంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని పలువురు కోరారు.

# ప్రభుత్వ సలహాదారుడిగా మాజీ డీజీపీ..

**ఏబీ వెంకటేశ్వరరావు 2014-2019 మధ్య టీడీపీ హయాంలో ఇంటిలిజెన్స్ చీఫ్‌గా పనిచేశారు. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ సర్కార్ ఆయనపై సస్పెన్షన్ వేటు వేసింది.**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారుగా మాజీ డీజీపీ ఆర్.పి ఠాకూర్ నియమితులయ్యారు. రెండేళ్ల కాలపరిమితితో ఆయన్ను ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వుల్లో తెలిపింది. ఢిల్లీలోని ఏపీ భవన్ వేదికగా ఠాకూర్ విధులు నిర్వహిస్తారని సాధారణ పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా ఉత్తర్వులు ఇచ్చారు. అలాగే రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుకు కూడా కీలక పదవి దక్కిన సంగతి తెలిసిందే.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో మాజీ డీజీపీకి కీలక పదవిలో నియమించింది. ఢిల్లీలోని ఏపీ భవన్ కేంద్రంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారునిగా మాజీ డీజీపీ ఆర్పీ ఠాకూర్ నియమితులయ్యారు. ఈ నియామకానికి సంబంధించి సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా ఉత్తర్వులు జారీచేశారు. ఠాకూర్ రెండేళ్ల పాటు ఈ బాధ్యతలు నిర్వహించనున్నారు. అయితే ప్రభుత్వ సలహాదారుల వేతనాలకు సంబంధించిన జీవోలను ప్రత్యేకంగా ఇస్తామని ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది. ఆర్పీ ఠాకూర్ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో డీజీపీగా పని చేసిన సంగతి తెలిసిందే.

మరోవైపు రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన సంగతి తెలిసిందే. ఆయన రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు.. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏబీ వెంకటేశ్వరరావు 2014-2019 మధ్య టీడీపీ హయాంలో ఇంటిలిజెన్స్ చీఫ్‌గా పనిచేశారు. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ సర్కార్ ఆయనపై సస్పెన్షన్ వేటు వేసింది. 2020 ఫిబ్రవరి నుంచి 2022 ఫిబ్రవరి 7 వరకు ఒకసారి.. 2022 జూన్ 28 నుంచి 2024 మే 30 వరకు రెండోసారి సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. కోర్టు ఆదేశాలతో ఆయన పదవీ విరమణకు ముందు రోజు జగన్ ప్రభుత్వం పోస్టింగ్ ఇవ్వగా.. ఆ వెంటనే రిటైర్ అయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. వెంకటేశ్వరరావుపై గత ప్రభుత్వ హయాంలో నమోదు చేసిన అభియోగాల్లో వాస్తవం లేదని తేల్చారు. దీంతో ఆయన సస్పెన్షన్ కాలాన్ని విధులు నిర్వహించినట్లుగా క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు గత ప్రభుత్వ హయాంలో సస్పెన్షన్ కాలంలో వెంకటేశ్వరరావుకు ఇవ్వాల్సిన వేతనం, అలవెన్సుల్ని చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఏబీవీకి సస్పెన్షన్ వేటు పడకపోతే ఎంతమొత్తం ఇవ్వాలో ఆ మేరకు మొత్తాన్ని ప్రభుత్వం చెల్లించనుంది. మొత్తం మీద రిటైరైన ఇద్దరు సీనియర్ ఐపీఎస్ ఆఫీసర్లకు ప్రభుత్వం కీలక బాధ్యతల్ని అప్పగించింది.

# ప్రభుత్వం కొత్త కార్యక్రమం.. తొలుత అక్కడే!

**వారం మొత్తంలో జరిగిన తరగతులపై పరీక్ష నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షా ఫలితాల ఆధారంగా విద్యార్థుల పురోగతిని స్కూలు యాజమాన్యం అంచనా వేయనుంది.**



రాష్ట్రంలోని విద్యార్థుల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో నూతన కార్యక్రమం తీసుకువచ్చింది. విద్యాశక్తి పేరుతో చదువులో వెనుకబడిన విద్యార్థులకు అదనంగా ఆన్‌లైన్ బోధన అందిస్తున్నారు. స్కూలు, కాలేజీ సమయం పూర్తైన తర్వాత అదనంగా గంటపాటు మద్రాస్ ఐఐటీఎం వారితో తరగతులు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం మద్రాస్ ఐఐటీతో ఏపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే ప్రస్తుతానికి విద్యాశక్తిని కేవలం అనంతపురం, గుంటూరు జిల్లాలలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి రాష్ట్రమంతటా అమల్లోకి తెచ్చే ఆలోచనలో ఏపీ విద్యాశాఖ ఉంది.

చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విద్యాశక్తి పేరుతో ప్రస్తుతం ఈ పథకం అమలు చేస్తున్నారు. విద్యాశక్తి కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో చదువులో వెనుకబడిన విద్యార్థులకు ఆన్‌లైన్‌లో పాఠాలు నేర్పిస్తున్నారు. ఐఐటీ మద్రాస్‌లోని ఐఐటీఎం ప్రవర్తక్ టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ సహకారంతో ఆన్ లైన్ బోధన జరుగుతోంది. అయితే ఏపీ విద్యాశాఖ ప్రస్తుతం అనంతపురం, గుంటూరు జిల్లాలలో ఈ కార్యక్రమాన్ని పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టింది.

విద్యలో సంస్కరణల కోసం ఐఐటీ మద్రాసుతో ఏపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఒప్పందంలో భాగంగానే వెనుకబడిన విద్యార్థులకు ఆన్ లైన్ ద్వారా అదనంగా తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతానికి అనంతపురం, గుంటూరు జిల్లాలలో పైలెట్ ప్రాజెక్టుగా విద్యాశక్తి అమలవుతోంది. ఈ జిల్లాలలో వచ్చే ఫలితాల ఆధారంగా జూన్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ విధానాన్ని ప్రవేశపెట్టాలని ఏపీ విద్యా శాఖ భావిస్తోంది. ప్రస్తుతం ఆరు నుంచి ఇంటర్ విద్యార్థుల వరకూ ఈ ఆన్ లైన్ బోధన జరుగుతోంది.

విద్యాశక్తి కింద స్కూలు, కాలేజీ సమయం పూర్తి అయిన తర్వాత చదువులో వెనుకబడిన విద్యార్థులకు సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకూ గంట పాటు జూమ్ ద్వారా ఆన్‌లైన్ పాఠాలు బోధిస్తారు. అయితే పదో తరగతికి మాత్రం మినహాయింపు ఇచ్చారు. వారికి పాఠశాలల్లోనే అదనపు తరగతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో విద్యాశక్తి నుంచి వారికి మినహాయింపు ఇచ్చారు.

మరోసారి విద్యాశక్తి కింద చదువులో వెనుకబడిన విద్యార్థులకు ఆన్‌లైన్ బోధన జరుగుతున్నప్పటికీ.. అది విద్యార్థులకు ఎంతమేరకు ఒంటబడుతోంది, వారు ఎంత వరకూ అర్థం చేసుకుంటున్నారనే దానిపైనా ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఇందుకోసం ప్రతి శనివారం పరీక్షలు పెడుతున్నారు. వారం మొత్తంలో జరిగిన తరగతులపై పరీక్ష నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షా ఫలితాల ఆధారంగా విద్యార్థుల పురోగతిని స్కూలు యాజమాన్యం అంచనా వేయనుంది. మరోవైపు స్కూల్ విద్యార్థుల కోసం ఏపీ ప్రభుత్వం ఇప్పటికే నో బ్యాగ్ డే అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. పాఠశాల విద్యార్థులకు బ్యాగుల మోత తప్పించాలనే ఉద్దేశంతో ప్రతి శనివారం ఈ నో బ్యాగ్ డే అమల్లోకి తెచ్చారు.

